ప్రభుత్వ భూములు స్వాహా!

- కొండ భూములు, ల్యాండ్ సీలింగ్ భూముల అన్యాక్రాంతం
- గుట్టు చప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్
- రూ.లక్షలు ఆర్జిస్తున్న అక్రమార్కులు



నాగంపల్లి రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న ల్యాండ్ సీలింగ్ భూమి

సీతానగరం: మండలంలోని నాగంపల్లి రెవెన్యూ పరిధిలో గల ల్యాండ్ సీలింగ్, కొండ భూములకు రెక్కలు వచ్చాయి. కొందరు వాటి రికార్డులను తారుమారు చేసి, కబ్జా చేశారనే ఆరోపణలు తలెత్తుతున్నాయి. ల్యాండ్ సీలింగ్‌లో ఉన్న సర్వే నంబర్‌ను సబ్ డివిజన్ చేసి ప్రభుత్వ భూములను 22 ఏ నుంచి తప్పించి, రాజమహేంద్రవరం రూరల్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పేరున ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు పొందుపర్చినట్టు సమాచారం. అతడి ద్వారా భూములను కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలుస్తోంది. ఆ భూములను లక్షల రూపాయలకు అమ్మకాలు జరిపారు. మరికొంత భూమిని విక్రయించేందుకు సమాయాత్తమవుతున్నారు.

వివరాలు ఇవీ..

నాగంపల్లి రెవెన్యూ పరిధిలోని అచ్చయ్యపాలెం అరవాలమ్మ కొండ వద్ద సర్వే నంబరు 205, 216, 217, సర్వే నంబరు ఒకటి నుంచి 16, 18లలో వందల ఎకరాలను ప్రభుత్వం 1973 ల్యాండ్ సీలింగ్ యాక్టులో స్వాధీనం చేసుకుంది. దీనిలో కొంత భూమిని పేదలకు ఇవ్వగా, ఇంకా చాలా మిగిలి ఉంది. ఇదే కాకుండా సర్వే నంబర్ 209 కొండగా ఏ రిజిస్టర్‌లో ప్రభుత్వ భూమిగా నమోదైంది. కొండ విస్తీర్ణంలో కొన్ని ఎకరాల భూమిని సాగుకు పనికి వచ్చేలా చేసుకుని, ఆ భూమిని రెవెన్యూ రికార్డులో సబ్ డివిజన్ చేశారు. దాన్ని ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్‌కు అనుకూలంగా రికార్డులు మార్పు చేశారు. కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో బినామీలను సృష్టించి వారి పేరున ఆన్‌లైన్ చేసి, ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ భూములనే లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు

ఈ భూదందాపై ఏప్రిల్ 19న చినకొండేపూడికి చెందిన ఇందుకూరి సురేష్ వర్మ ఆధ్వర్యంలో అచ్చయ్యపాలేనికి చెందిన పలువురు నిరుపేదలు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 216/2ఎ,1సీలో 5.30 ఎకరాలు, 216/2ఎ, 1ఎలో 7.70 ఎకరాలను మిర్తిపాడుకు చెందిన జగర్లమూడి లక్ష్మి కుమారి.. పేదల కోసం వదిలేశారన్నారు. ఆ 13 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో ఆమె పేరుమీదే ఉండేదన్నారు. దాన్ని తొలగించి మన్యం అప్పారావు దొర పేరు ఆన్‌లైన్‌లో ఎలా ఉంచారని, ఆ భూమిని అప్పారావు దొర ఇతరులకు రిజిస్ట్రేషన్ ఎలా చేశారని, మిగిలిన భూమి ఎవరి పేరుపై ఉందనేది తెలియపర్చాలని కోరారు. నిరుపేదలకు కొంత భూమి అందించి, మిగిలినదాన్ని అరవాలమ్మ అమ్మవారి దేవాలయానికి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

ఆ అవకాశమే లేదు

209 సర్వే నంబర్ పూర్తి విస్తీర్ణం కొండగానే ఉందని, దానిని సబ్ డివిజన్ చేసే అవకాశం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. 216 సర్వే నంబర్ ల్యాండ్ సీలింగ్ భూమి అయినందున దీనిపై పూర్తిగా రికార్డులు పరిశీలించాల్సి ఉందన్నారు. దీనిపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా నాగంపల్లి భూముల విషయమై ఫిర్యాదు అందిందని, 216 సర్వే నంబరు రికార్డుల కోసం అర్జీ పెట్టామన్నారు. ఆ రికార్డులు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

13 ఎకరాలు ఎవరి పేరున ఉన్నాయి



నాగంపల్లి రెవెన్యూ పరిధిలోని 216/2ఎ,1సి, 216/2ఎ,1ఎ లోని 13 ఎకరాలు ఎవరి పేరుపై ఉన్నాయనేది రెవెన్యూశాఖ అధికారులు నిర్ధారణ చేయాలి. ఇందులో ఎంతభూమి వేరే వ్యక్తిపై ఉంచి, అమ్మకాలు జరిపారు, మిగిలిన భూమి ఎవరి పేరుపై ఉందనేది పరిశీలించాలి. అచ్చయ్యపాలెంలోని నిరుపేదలకు, అరవాలమ్మ అమ్మవారి దేవాలయానికి కొంత భూమి అందించాలి. రెవెన్యూ రికార్డులలో పేర్లను మార్చి మారు అమ్మకాలు జరుపుతున్నారు. దీనిపై విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలి.

– ఇందుకూరి సురేష్ వర్మ, చినకొండేపూడి

రికార్డులను పరిశీలించి..



సర్వే నంబరు 216 రికార్డుల కోసం అర్జీ పెట్టాం. అవి అందిన వెంటనే పరిశీలించి, పోలవరం కాలువలో ఎంత భూమి వెళ్లింది, జిరాయితీ భూమి ఎంత ఉందనే విషయాన్ని పరిశీలిస్తాం. మిగిలిన భూమి ఎవరి పేరుపై ఉందనేదీ తెలుసుకుంటాం. ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఉంటే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎ.శ్రీనివాస్, తహసీల్దార్, సీతానగరం

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు



బొబ్బిల్లంకలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ బడి – సౌకర్యాల ఒడి పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరిస్తూ నినాదాలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో పాఠశాల సాధించిన ప్రగతిని తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.రామకృష్ణ, జేవీ మోహనరావు, బొగ్గుల సత్యనారాయణ, రత్నప్రసాద్, సుబ్బలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దొరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శామ్యూల్ తెలిపారు. 33/11 కేవీ పురుషోత్తపట్నం లైన్ మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేస్తామన్నారు. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చీపురుపల్లి, అచ్చయ్యపాలెం, పెదకొండేపూడి గ్రామాలకు, తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకం, సత్యసాయి వాటర్ ప్రాజెక్టు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య



అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బిక్కవోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందిస్తున్నారని సర్పంచి బుంగా రామారావు అన్నారు. బలభద్రపురం గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోని ఐసీడీఎస్ సూపర్ వైజర్ యు.పద్మావతి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అలవర్చాలి

రంగంపేట: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆధ్యాత్మిక చింతనను పిల్లలకు అలవర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. కోటపాడులో బుధవారం జరిగిన ధార్మిక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేవుడి కన్నా ధర్మం గొప్పదని, ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందన్నారు. ఇతిహాసాలు, దేశభక్తుల కథలు తెలపడం ద్వారా పిల్లలు ఆదర్శ పౌరులుగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో ఖండ ధర్మ ప్రచారక్ తంగెళ్ల రాంబాబు, మహిళా మండలి సహ కన్వీనర్ తోట ఈశ్వరి, ఆచంట పద్మ, ధార్మిక జట్టు సభ్యులు పాల్గొన్నారు.

పాశాలమ్మ జాతర ప్రారంభం

సీతానగరం: కాటవరం గ్రామ దేవత పాశాలమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు వైభవంగా ఈ మహోత్సవం నిర్వహించనున్నారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మాజీ అధ్యక్షుడు గూడపాటి జయరామ్ సన్మానించారు.

రహదారుల అభివృద్ధికి కృషి



పైన గ్రామంలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి

పెదపూడి: రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పైన గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం, పెదపూడిలో రైతులకు రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ, శహపురంలో మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని పురంధేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి తదితరులు బుధవారం ఆవిష్కరించారు. ఎంపీపీ కేతా తులసి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, జుత్తుక సూర్యకుమారి, సర్పంచులు సుందరపల్లి ప్రమీళ, కలవల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పదవులు పొందిన వారికి అభినందనలు



పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ మండల మహిళ ప్రధాన కార్యదర్శిగా కుతుకులూరు గ్రామానికి చెందిన తేతలి రుక్మిణిని నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అలాగే మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా సత్తి రాజశేఖరరెడ్డి నియమితులయ్యారన్నారు. ఈ మేరకు బుధవారం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఉప సర్పంచి సబ్బెళ్ల నాగిరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

సీతానగరం: మండలంలోని మిర్తిపాడు శివారున గల సారా బట్టీపై దాడి చేసి, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మిర్తిపాడు శివారున కోరుకొండ మండలం బుచ్చింపేటకు చెందిన శ్రీను సారా తయారు చేస్తున్నాడనే సమాచారంతో దాడి చేశామన్నారు. శ్రీను పరారీ కావడంతో అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

30 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి



ప్రభాకరరావు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ఈ-కేవైసీ చేయించుకోని రైస్‌కార్డు లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోపు చేయించుకోవాలని సివిల్ సప్లయిస్ రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం రైస్‌కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే స్మార్ట్‌కార్డుల్లో ఈ-కేవైసీ చేయించుకోని కార్డులు రావన్నారు. కొందరు పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయకపోవడంతో ఈ-కేవైసీ కావడం లేదన్నారు. వారందరూ సమీపంలోని ఆధార్ సెంటర్‌లో చేయించుకోవాలన్నారు. రేషన్‌షాపుల్లోని ఈపీవోఎస్, గ్రామ సచివాలయం సిబ్బంది వద్ద గల మొబైల్‌యాప్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చన్నారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా మీ ఫోన్‌లోనే ఈ-కేవైసీ స్థితి తెలుసుకోవచ్చన్నారు.

యాంత్రీకరణతో లాభదాయక వ్యవసాయం



బొల్లెద్దుపాలెంలో వ్యవసాయ యంత్రాలను రైతులకు పంపిణీ చేస్తున్న అధికారులు

కోరుకొండ: యాంత్రీకరణతో లాభదాయక వ్యవసాయం చేయవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో బుధవారం రైతులకు యాంత్రీకరణ యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి 211 రైతుసేవా కేంద్రాల పరిధిలో 675 యూనిట్లు గ్రౌండింగ్ చేశామన్నారు. వీటి ద్వారా రూ.3.58,27,637 సబ్సిడీ రూపంలో రైతులకు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ యంత్రాలను రైతులు ఒకరికొకరు ఇచ్చుకుని వ్యవసాయ విస్తరణకు దోహదపడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. అంతర పంటలపై కూడా రైతులు దృష్టి సారించాలన్నారు. బొల్లెద్దుపాలెం సర్పంచ్ కురుమళ్ల వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొల్లెద్దుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు, ఏడీ బీకే మల్లికార్జునరావు, ఏవోలు గౌరీదేవి, రాజరాజేశ్వరి, రామతులసి, వ్యవసాయశాఖ సహాయకుడు షిరోజ్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

కంబాలచెరువు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు నూతన అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసుకున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నాయన్నారు. పేదల నుంచి అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులు గుంజుతున్నాయన్నారు. అరకొర వసతులతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకోని ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షులు భానుప్రసాద్, రూప శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

అనపర్తి: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన అనేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ సత్తి కృష్ణ చైతన్య రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా బుధవారం అనపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీవన ఎరువులపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

రాజానగరం: పంట కోత అనంతరం మిగిలిన వ్యర్థాలు, అవశేషాలను సూక్ష్మ జీవుల కల్చర్‌తో కుళ్లబెడితే, తదుపరి పంటకు అది సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని రాజమహేంద్రవరంలోని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. దీనిద్వారా ఆరోగ్యకర పంటలు పండించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం 'సూక్ష్మ జీవులకు సంబంధించిన జీవన ఎరువులు – విశిష్టత' అనే అంశంపై అవగాహన కలిగించారు. అలాగే జీవన ఎరువుల గురించి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.అనూష ప్రయోగాత్మకంగా వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్ పర్యవేక్షణలో పది రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు



చినకొండేపూడిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

సీతానగరం: భూసార పరీక్షలతో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇఫ్కో మేనేజర్ గుంటక శ్యామ్ ప్రసాద్‌బాబు అన్నారు. చినకొండేపూడి పంటపొలాల్లో బుధవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలను సేకరించారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పంట అనంతరం నేలను ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట పెంచడం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇఫ్కో ప్రవేశపెట్టిన నానో ఎరువులను రైతులు అలవాటు చేసుకోవాలని, నానో యూరియా, నానో డీఏపీలతో పాటు నానో జింక్, నానో కాపర్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్, సత్తిబాబు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనులకు శ్రీకారం

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ కాలువ పూడికతీత పనులను ప్రారంభించామని జలవనరులశాఖ ఏఈ శివరామకృష్ణ తెలిపారు. రామచంద్రపురం వద్ద టీపీ స్కీమ్ ఎడమ కాలువలో పూడిత తీత పనులను పొక్లెయిన్‌తో బుధవారం స్కీమ్ చైర్మన్ వేగి శ్రీనివాస్, వైస్ చైర్మన్ మందపాటి జగపతిబాబు, అధ్యక్షుడు కోనే శ్రీనివాస్, రైతులు గుర్రం ఉదయ్ భాస్కర్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణ మాట్లాడుతూ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు.

ఉపాధ్యాయిని రమ్యసుధకు అభినందనలు

రంగంపేట: ఉత్తమ పరిశోధనల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో రంగంపేట హైస్కూలుకు గుర్తింపు తెచ్చిన రమ్యసుధ కృషి అభినందనీయమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రశంసించారు. రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో మంగళవారం తనను కలిసిన రమ్యసుధతో ఎంపీ మాట్లాడారు.

యోగా సాధనతో ప్రశాంత జీవితం



జీజీయూలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



యోగాంధ్ర ఆకారంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

రాజానగరం: ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానికే దక్కుతుందని రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఈగల్) ఆర్‌కే రవికృష్ణ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యోగా సాధన చేయడం ద్వారా శరీరక, మానసిక రుగ్మతలను తొలగించుకుని, ప్రశాంత జీవనం గడిపేందుకు వీలుంటుందన్నారు. ఇంత భారీ ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. చైతన్యరాజు మాట్లాడుతూ ఈ నెల 21న కూడా ఇదే ప్రాంగణంలో మరోసారి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ముందుగా ఎస్పీఎఫ్ కమాండెంట్ కొండా నరసింహరావు దంపతులు పూరించిన శంఖారావం అందరినీ అబ్బురపరచింది. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీ మురళీకృష్ణ, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐలు వీరయ్య గౌడ్, సూర్యమోహనరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర, జీజీయూ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రొఫెసర్ వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీవీఎస్ శర్మ పాల్గొన్నారు.

విదార్థుల ప్రదర్శన

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక దివ్య విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు 'యోగాంధ్ర' ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. మరికొందరు విద్యార్థులు.. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో యోగాసనాలు వేస్తూ, యోగా సాధనపై ఇతరులకు అవగాహన కల్పించారు.

మోగాసనాలపై అవగాహన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా ఈ నెల 21 వరకూ ప్రతి రోజు యోగాసనాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

- ప్రశాంత, ఆరోగ్యం కోసం యోగా సాధన చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి లక్ష్మీనారాయణ అన్నారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో యోగా అభ్యసనం నిర్వహించారు. ఏపీఆర్ చౌదరి, నీరుకొండ వీరన్న చౌదరి, రాపాక వెంకటలక్ష్మి పాల్గొన్నారు

యోగాంధ్రను విజయవంతం చేయాలి

బిక్కవోలు: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమానికి ఎక్కువమంది హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీజీయూలో మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఈగల్) రవికృష్ణ



బిక్కవోలులో మాట్లాడుతున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శశాంక



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..